క్లుప్తంగా

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం



కోరుకొండ పీఆర్టీయూ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను ఎగురవేసిన నాయకులు

మధురపూడి: పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కోరుకొండలోని యూనియన్ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ విశ్రాంత ఉపాధ్యాయులు, యూనియన్ సీనియర్ నాయకులు వి.భూపతిరావు, సింగారపు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పల్ల రాజారావు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధనలో యూనియన్ అలుపెరగని పోరాటం చేసిందన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకుని సంతోషాన్ని వెలిబుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మింగి శ్రీనివాస్, కల్లేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో బీజేపీ విజయంపై హర్షం

పెదపూడి: ఢిల్లీలోని అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించడంపై ఆ పార్టీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్ట్ వైఎస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి హరినారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీకి అన్ని వర్గాల మద్దతు

మధురపూడి: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన ద్వారా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని, దానిలో భాగంగానే ఢిల్లీ ప్రజలు బీజేపీకి అధికారాన్నిచ్చారని ఆ పార్టీ రాజానగరం కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి అన్నారు. ఆదివారం మధురపూడి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. రైతన్నలకు వ్యవసాయసాగులో భరోసా, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడంతోపాటు, ప్రజలకు సంక్షేమ పథకాలను సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

శ్రీరామ కోటి స్థూపం వార్షికోత్సవం

బిక్కవోలు: కొంకుదురులోని బుడతల మామిడి రేవు వద్ద ఉన్న శ్రీరామ కోటి స్థూపం 36 వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని అర్చకులు కృష్ణ చైతన్య పంతులు, ఆధ్వర్యంలో కల్యాణ కర్తలుగా గ్రామానికి చెందిన కొవ్వూరి శ్రీధర్ రెడ్డి, పార్వతి దంపతులు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



మర్రిపూడిలో మురికి కాలువల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న కార్మికులు

రంగంపేట: మర్రిపూడిలో సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేము మాధవి మాట్లాడుతూ దోమల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున మురికి కాలువల్లోని పూడిక తొలగించి కాలువలకు ఇరువైపులా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉండటంతో పంచాయతీ కార్మికులతో గడ్డి మందు, దోమలు మందు ఎబెట్ పిచికారీ చేయించామన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించామన్నారు. గ్రామంలోని ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించినట్టు సర్పంచ్ అన్నారు.

సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



అచ్యుతాపురంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈలకొలను గ్రామ శివారు అచ్యుతాపురంలో ఆదివారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన ప్లాస్టిక్ డ్రమ్ముల్లోని 200 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి డ్రమ్ముతో సహా బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఆమె చెప్పారు.

అసంపూర్తిగా అదనపు తరగతి గదులు

- నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో?
- శాఖల మధ్య సమన్వయ లోపం
- నిధులున్నా పనుల్లో జాప్యం
- ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా అధికారుల నుంచి స్పందన కరువు



మర్రిపూడిలో అసంపూర్తిగా ఆగిపోయిన అదనపు తరగతి గదుల భవన నిర్మాణం

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడిలో పుట్టా శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయాయి. నిర్మాణానికి అవసరమైన నిధులు, సామగ్రి అందుబాటులో ఉన్నా ఏడాది కాలంగా నిర్మాణం ముందుకు సాగకపోవడం వల్ల భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. పాఠశాల విద్యార్థుల అవసరాల మేరకు 2023లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన మన బడి నాడు–నేడు పథకంలో ఈ పాఠశాలకు 5 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి రూ.60 లక్షలు నిధులు మంజూరు చేసారు. నిధులు మంజూరు కావడంతో నిర్మాణం ప్రారంభించి మూడు గదులు వరకు పూర్తయిన తరువాత పనులు ఆగిపోయాయి. ఆ మూడు గదులకు కూడా పూర్తిస్థాయిలో పనులు పూర్తికాలేదు. గదుల పైన, కింద ఫ్లోరింగ్, గోడలకు ప్లాస్టింగ్ చేయకపోవడం వల్ల భవనం రోజు రోజుకీ శిథిలావస్థకు చేరుతోంది. పాఠశాల ఖాతాలో రూ. 8 లక్షల నిధుల నిల్వ ఉంది. నిర్మాణ సామగ్రి ఇసుక, చిన్న కంకర, ఫ్లోరింగ్ స్లాబ్స్ అందుబాటులో ఉన్నాయి.

పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వినతులు

విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్, మండల ఇంజనీరింగ్ శాఖల మధ్య సమన్వయం లేక నిర్మాణం మధ్యలో ఆగిపోయినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 6 నెలలుగా పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పలువురు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, మండల విద్యాశాఖాధికారి మధుసూధనరావు, జిల్లా సమగ్ర శిక్ష అధికారి సుభాషిని చుట్టూ తిరిగి వినతిపత్రాలు అందిస్తున్నా ఫలితం కనిపించడం లేదని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి ఆవేదన వ్యక్తం చేసారు. ఈ ఏడాది ఏప్రిల్ 25లోగా పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తికాకపోతే నిధులు మురిగిపోయే ప్రమాదం ఉంది. దీంతో వెంటనే నిర్మాణ పనులు చేపట్టి భవనం పూర్తిచేసేలా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

15న వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ



రావుల చెరువు గట్టున విగ్రహ ప్రతిష్ఠకు సిద్ధమైన ఆలయం

రాజానగరం: స్థానిక రావులచెరువు గట్టున నూతనంగా నిర్మించిన ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 15న జరుగనుంది. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయంలో వైశ్య నాయకుడు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఆరోజు ఉదయం 10.53 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూజా కార్యక్రమాలు 13 నుంచే ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. అదే రోజు ఉదయం 11.30 గంటల నుంచి ఆలయం వద్దనే అన్నసమారాధన జరుగనుంది.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



సింగంపల్లిలో ఇళ్ల పట్టాల కోసం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రంగంపేట: ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని సింగంపల్లిలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. స్థానిక సిపిరెడ్డి నగర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీరెడ్డి నగర్ వాసుల సమస్యలపై చర్చించి, దశలవారీ పోరాటానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ 25 ఏళ్లుగా సింగంపల్లిలో 15 ఎకరాల సీలింగ్ భూముల్లో ఇళ్లు లేని పేద ప్రజలు పాకలు వేసుకుని, సీపీరెడ్డి నగర్‌గా పేరుపెట్టి అక్కడ జీవిస్తున్నారని అన్నారు. ఆ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు, వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించి, పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేసారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్సీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రమేష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, ఏపీఆర్సీఎస్ నాయకులు దోశెట్టి సురేష్, చెక్కా సత్తిబాబు, వి. సత్తిబాబు, రాయుడు కన్నబాబు, లక్ష్మి, ముమరాంబి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నా.. పట్టించుకోరు!

- కూటమి ఫ్లెక్సీలు యథాతథం
- అధికారుల తీరును ప్రశ్నిస్తున్న ప్రజలు





ముగ్గళ్లలో కూటమి నాయకుల ఫ్లెక్సీలు



వెదుళ్లపల్లిలో..

సీతానగరం: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి సీతానగరం మండలంలో సక్రమంగా అమలు కావడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈనెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల కోడ్ కొన్ని రోజుల క్రితమే అమలులోకి వచ్చింది. ప్రతి సోమవారం మండలాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండటంతో కలెక్టర్ రద్దు చేశారు. ఎలక్షన్ కోడ్ వచ్చిందంటే గ్రామాల్లోని విగ్రహాలకు ముసుగులు తొడగడంతోపాటు, ఎటువంటి ఫ్లెక్సీలున్నా వాటిని తొలగించడం, శిలాఫలకాలకు పేపర్లు అంటించడం వంటి చర్యలు సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చేపడుతుంటారు. త్వరలో నిర్వహించనున్న ఎమ్మెల్సీకు సంబంధించి ఎన్నికల కోడ్‌ను పక్కన పెట్టి కూటమి నాయకుల ఫ్లెక్సీలకు అధికారులు మినహాయింపు ఇచ్చారా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు వేయడానికి సుమారు 1,500 ఓటర్లు ఉన్నారు. వీరికి సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమం చేపట్టలేదు. వంగలపూడి, రఘుదేవపురం, ముగ్గళ్ల, వెదుళ్లపల్లి తదితర గ్రామాల్లో ఫ్లెక్సీలు అలాగే ఉన్నాయి. దీనిపై మండల ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తక్షణమే ఫ్లెక్సీలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ఎమ్ భారతిని వివరణ కోరగా ఎలక్షన్ కోడ్‌తో పంచాయతీ అధికారులను ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించామన్నారు. కొన్ని గ్రామాల్లో తొలగించారన్నారు. కొన్ని గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగిస్తామని ఏర్పాటు చేసిన వారు చెప్పడంతో ఇప్పటి వరకు వేచి ఉన్నామని తెలిపారు. వాటిని తొలగించాలని ఆయా పంచాయతీ అధికారులకు తెలియజేసినట్టు ఎంపీడీవో భారతి తెలిపారు.

గోదావరి జిల్లా వాసుల మర్యాద మరువలేనిది

అక్కినేని నాగచైతన్య



అప్సరా థియేటర్‌లో ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతున్న అక్కినేని నాగచైతన్య

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి జిల్లా వాసుల మర్యాద, ఆదరణ మరువలేనిదని యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య పేర్కొన్నారు. ఆదివారం అప్సర థియేటర్ మొదటి ఆట మధ్యలో తండేల్ చిత్ర యూనిట్ సందడి చేసింది. హీరో నాగచైతన్య, దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత బన్నీ వాసు, హాస్యనటుడు మహేష్ ప్రేక్షకులతో మాట్లాడి సందడి చేశారు. హీరో నాగచైతన్య మాట్లాడుతూ తండేల్ సినిమాను సూపర్‌హిట్ చేసిన అక్కినేని అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులకు నాగచైతన్య ధన్యవాదాలు తెలిపారు. నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ దర్శకుడు చందూ మొండేటి, తాను గోదావరి జిల్లా వాసులమేనని, సినిమాను సూపర్‌హిట్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. అక్కినేని నాగార్జున, నాగచైతన్య, అఖిల్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటం రజనీకాంత్, అభిమానులు నాగచైతన్యకు భారీ గజమాల వేశారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. గీతా ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూటర్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం షాపులకు 36 దరఖాస్తులు

రంగంపేట: గీత కార్మిక కులాలకు చెందిన వారికి ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల కోసం 36 దరఖాస్తులు అందినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుధ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రంగంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలు ఉన్నాయన్నారు. మండలానికి ఒకటి చొప్పున మొత్తం మూడు షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించగా అనపర్తి మండలానికి 9, బిక్కవోలు మండలానికి 14, రంగంపేట మండలానికి 13 దరఖాస్తులు అందినట్టు ఆమె చెప్పారు. వీటికి సంబంధించిన డ్రా సోమవారం నిర్వహించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాయిదా పడిందన్నారు. తిరిగి ఎప్పుడు డ్రా నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని ఆమె తెలిపారు.

ఆవ భూముల్లో జామాయిల్ చెట్ల నరికివేత

మధురపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వడానికి కొనుగోలు చేసిన ఆవ భూముల్లోని సంపదను కొందరు కాజేస్తున్నారు. జామాయిల్ చెట్లను నరికేసి, అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికార కూటమి పార్టీ నాయకుల అండదండలతోనే ఈ పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో చెట్లను నరికివేసి, రవాణా చేయడంతో అధికారులు పట్టుకోవడానికి అవకాశం లేదు. ప్రభుత్వ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అక్రమాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగం



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

సీటీఆర్ఐ: కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ వరాహలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో చందన యాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి శ్రీవారి అన్నప్రసాదం స్వీకరించారు. ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చక స్వామి అవసరాల కిరణ్ స్వామి, ముప్పిరాల అనంతాచార్యస్వామి, పరాశర రఘునాథభట్టర్ స్వామి పూజలు నిర్వహించి శ్రీవారి ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధనలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. చందన యాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన రెవెన్యూ, పోలీసు, రాజమండ్రి నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది, శ్రీవారి సేవకులకు ఆలయ ధర్మకర్తలు కె.సూర్యసింహాచలం, కె.నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

డైట్ ఛాత్రోపాధ్యాయులకు బహుమతులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్) ఛాత్రోపాధ్యాయులు జి.ఉషాభార్గవి, కె.ప్రహర్షిత బహుమతులు సాధించారు. ఆదివారం రామచంద్రపురంలో రేవతి సైన్స్ ఫౌండేషన్ ఈనెల 11వ తేదీ అంతర్జాతీయ విజ్ఞాన శాస్త్ర రంగంలో మహిళలు, బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీరియాడిక్ టేబుల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో డైట్ ఛాత్రోపాధ్యాయులు జి.ఉషా భార్గవి, కె.ప్రహర్షిత రూపొందించిన ఎలిమింట్స్ ఇన్ ది యూనివర్స్ ఆన్ ది వర్ల్డ్ యూనివర్స్, స్నేక్ అండ్ లేడర్ గేమ్ విత్ ఆటమిక్ నంబర్స్ నమూనాలకు ప్రత్యేక బహుమతులు అందించారు. ఛాత్రోపాధ్యాయులకు రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణసాయి, గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ కవిత చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్స్, బుక్స్ అందజేశారు. ఈ మోడల్స్ తయారీలో డైట్ సీనియర్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ మార్గదర్శిగా వ్యవహరించారు. వీరిద్దరినీ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ అభినందించారు.

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కడియం: దుళ్లలోని భూ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు, ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిర్మించిన హోమగుండంలో వేద పండితులు ఈ హోమ క్రతువును నిర్వహించారు. తెల్లవారు జామునే ప్రత్యేక పూజల అనంతరం హోమం ప్రారంభించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సహస్ర దీపాలంకరణ అనంతరం రాత్రి హంస వాహనంపై స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. కోలాట భజన బృందాలు, మంగళ వాయిద్యాలు, సాంస్కృతి కార్యక్రమాలు వెంటరాగా స్వామివారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ భక్త బృందం ఏర్పాట్లు పర్యవేక్షించింది.

కన్నుల పండువగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



పుట్టకొండలో కల్యాణ వేదికపై ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి



పందలపాకలో పార్వతీసమేత సోమేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పందలపాకలో అభయ ఆంజనేయస్వామి పూజలు చేస్తున్న భక్తులు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహ స్వామి, లక్ష్మీదేవి దివ్య కల్యాణం ఆదివారం తెల్లవారు జామున 4 గంటలకు కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా శనివారం స్వామికి ప్రత్యేక పూజలు, రథోత్సవం నిర్వహించారు. అనంతరం తెల్లవారు జామున కల్యాణం వైభవంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలు, బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పి.గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది. కల్యాణం సందర్భంగా గ్రామ పరిసర గ్రామాలతో పాటు, జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకుని కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పీఏ అనంతాచార్యులు, ఈఓ వద్దాది సత్యనారాయణ, సర్పంచి వల్లు వెంకటరమణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణం కనులారా వీక్షించి పరవశమయ్యారు.

12న భారీ అన్నదానం

పుట్టకొండలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12 శ్రీ చక్రస్నానం కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు. ఆ సందర్భంగా మధ్యాహ్నం గ్రామస్తులు, భక్తులు సహకారంతో భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వద్దాది సత్యనారాయణ, సర్పంచ్ వల్లు వెంకటరమణ తెలిపారు.


ఘనంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణం

బిక్కవోలు: పందలపాక గ్రామంలో ప్రసిద్ధి చెందిన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మాళ్లపల్లి మల్లేశ్వరశర్మ ఆధ్వర్యంలో ముందుగా స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి అనంతరం కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకరించారు. ఈ కార్యక్రమంలోని గుణం శ్రీనువాసచౌదరి, కేవీరెడ్డి, సత్యనారాయణ, సత్యనారాయణరెడ్డి, కర్రి లచ్చారెడ్డి, ఆలయం ఈవో రామలింగ భాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

బిక్కవోలు: పందలపాకలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న అభయ ఆంజనేయస్వామి 11వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు.అర్చకులు గరిమెళ్ల విశేశ్వరరావు(బుజ్జి) ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతర సబ్బెళ్ల మంగయ్యమ్మ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గొలుగూరి సత్యనారాయణరెడ్డి, తమలంపూడి సూర్యనారాయణరెడ్డి, గొలుగూరి వెంకటరమణరెడ్డి, సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, మేడపాటి వీర రాఘవ గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌతమి గోశాలలో స్వచ్ఛభారత్



మొక్కలు నాటుతున్న ఆదిత్య కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు భాస్కర్‌నగర్ 50వ డివిజన్‌లోని గౌతమి గోశాలలో స్వచ్ఛభారత్, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫిలాన్త్రఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ శర్మ, ఎఫ్ఎస్ఎస్‌కె సుధాకర్ పట్నాయక్, రాజు పాల్గొన్నారు. ప్రాంగణంలోని ప్లాస్టిక్ కవర్లను, చెత్తను, వ్యర్థ పదార్థాలను, కలుపు మొక్కలను, గాజు, ప్లాస్టిక్ సీసాలను, తొలగించి, మొక్కలను నాటారు. రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్.ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, కె.మహేశ్వరి, పోలుకొండ సాయి, ఎన్.ఎస్.ఎస్. టీం లీడర్లతోపాటు 50 మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అద్దంకి రాజాను కె.సుధాకర్ పట్నాయక్ చేతులమీదుగా డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు శాలువా జ్ఞాపికలతో సత్కరించారు. ఆదిత్య అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణా రెడ్డి, ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణి కుమార్ ఎస్‌కేఎస్ రెహమాన్, రామకృష్ణ చంద్రశేఖర్లు ప్రోగ్రాం ఆఫీసులకు వలంటీర్లను అభినందించారు.